# పదహారు వేల ఒకటి

ఆ రోజు కార్తీక పౌర్ణమి రేపల్లెలో ఎటు చూసినా ఉదయం నుంచీ పండు వెన్నెలే ప్రకాశిస్తున్నట్టుగా ఉన్నది. ఏడు దశాబ్దాలు గడిచాక తిరిగి తమ సందగోకులంలో శ్రీకృష్ణుడి పదముద్రికలు...ఆ ఊహే అక్కడి వారి నందరినీ నిలిచిన చోట నిలవనీయడం లేదు.

వీధులన్నీ పరిశుభ్రం చేసి పన్నీరు చల్లారు. పన్నీరంటే రేపల్లె వారికి యమునా జలమే! ఒకప్పుడు చిన్ని కృష్ణుడి జలక్రీడలతో పునీతమైన యమున ఇన్నేళ్లయినా ఆ అనుభూతి పరిమళాలనే ప్రసాదిస్తూ ఉండడంతో రేపల్లెవాసులకు ఆ నీరు పన్నీరయింది యమునలో ఈదులాడడం బాలురకు జలకాలాడడం యువతీ యువకులకు వసంతోత్సవమే! కుంకుమపువ్వు కర్పూరం అత్తరు కల గలిపిన గొజ్జగినీరు వసంతోత్సవవేళ చిమ్ముకుని చల్లుకున్నట్లే యమునలో దిగీ దిగగానే 'ఓలోల' అంటూ చల్లుకుంటారు.

ఇంటి ముంగిట రంగుల రంగుల రంగవల్లికలు తీర్చారు. ఇంటి గడపలకు పసుపు కుంకుమలు దిద్దారు. ద్వారాలకు మామిడి తోరణాలు కట్టారు. ఆబాల గోపాలం శ్రీకృష్ణుడి రాకకోసం ఎదురు చూస్తూ ఉన్నట్టే 'రేపల్లె' లోని ఇళ్ళన్నీ వాకిళ్లె కళ్లు చేసుకుని చూస్తున్నాయి.

యశోదాదేవి తను యింటిని గత వారం రోజులుగా తీర్చి దిద్దుతూనే ఉంది. గోడలకు వేసిన అద్దకాలు సరిగా లేవని రోజుకో వర్ణం మార్పిస్తూ ఉన్నది. చివరికి ఎవరికి వారే తమ నిర్ణయం బావుందంటే తమ రంగు బాగా ఉందని అనడంతో యశోదమ్మ గోడలకు నీలి రంగే నిర్ణయించింది. ఇల్లలకగానే పండుగ అయ్యిందనుకోడానికి కొడుకు యింకా రానే రాడాయె! అయినా వస్తానని వర్తమానం పంపిన రోజున కాక ముందుగా ఎలా వస్తాడు! అతనేం సామాన్యుడా! రాజాధిరాజు రారాజు దుర్యోధన చక్రవర్తిత్వాన్ని స్వయంగా యుధిష్టిరుడికి కట్టబెట్టిన మహామేధావి.! రాజధాని కార్యక్రమాలు అన్నీ పూర్తిగా నిర్వర్తించు కున్నాకే తను పుట్టి పెరిగి బుద్దెరిగిన రేపల్లెకు విచ్చేస్తున్నాడు.

అష్టమహిషులతో అష్టైశ్వర్యాలతో తుల తూగిన ఆ మహాపురుషుడు విశ్రమించడానికి తగిన పానుపు ఎక్కడుంది? ఆనాడైతే నాలుగు వేదాల గొలుసులమరించిన తూగుటుయ్యాల్లో ఊపేనిద్రపుచ్చింది. అడ్డాల నాడూ, అడుగులు తడబడి నడిచినా నాడూ ఊయల అవసరం లేక పోయింది. పానుపు అవసరం లేక పోయింది అమ్మ ఒడిలోనే పాలకడలిలోలా శయనించాడు. కానీ ఇప్పుడు?

"ద్వారక నుండో హస్తిన నుంచో రాజభోగ్యమైన మంచం, పరుపులు తెప్పిస్తేనో! అన్నాడు నందుడు. భార్య దిగులు! సంశయం, సందిగ్ధం చూడలేక 'సయం! ఇంకా సకుటుంబ సపరివారంగా వస్తున్నాప్ అమర్చవలసినవీ, కావలసినవీ వెంట తెచ్చుకో అనలేదు. అంది ఆమె. 'తప్పంటావా యశోదా! కన్నయ్యగా గడిపినన్ని నాళ్లూ మన కనుసన్నల్లో మెలిగినాడు. ఇప్పుడు దేశానికే ఆరాధ్య పురుషుడైనాడు నాగరికుడైనాడు మనమూ! పల్లెసీమవాళ్లం అనాగరికులం!....

నందుడి మాట పూర్తి కాకుండానే అంది యశోద 'ద్వారకకు రాజైనా అమ్మకు కన్నయ్యే! ఎంతెత్తుకు ఎదిగినా మనకు అందకుండా పోడు' అందామె ఆత్మ విశ్వాసం ఉట్టి పడేట్టుగా 'మాట జారనీవు, కన్నయ్యని మాటపడనీవు'

'కన్న తల్లి మనసు మమత కన్నతల్లికే తెలుసు' అందామె గర్వంగా

'కన్నయ్యలూ తెలుసుకుంటారులే' అన్నాడు నవ్వుతూ.

'ఆ ఆశతోనే ప్రాణాలు నిలుపుకున్నా' అంది యశోద.

సరిగ్గా ఆ సమయంలో రాధ.......

పడకటింటి అలంకరణలో మునిగిపోయింది. ఆమె మనస్సు మనస్సులోలేదు. ప్రాణానికి ప్రాణమని భావించిన నల్లనయ్య కంసుడి ఆహ్వానం మీద వెళ్లి అక్కడ కంసశిక్షణ, దేవకీ వసుదేవ రక్షణ చేసి విద్యాభ్యాసానికి సాందీపుడి వద్దకు వెళ్లి అలా అలా గురు శుశ్రూష అనే నాటకం నిర్వహించి సకలం నేర్చుకుని రాజకీయ వేత్త అయి పాండవ పక్షాన నిలిచి రాయబారం నిర్వర్తించి యుద్ధం జరిపించి హస్తినలో తన వారిని నిలిపి యిప్పుడు తరలి వస్తున్నాడు. తమ దగ్గరికి...ఊహూ తన దగ్గరికి తన దగ్గరికి.....

తనకీ అతనికీ ఎంత దగ్గర?

ఎంతెంత దూరాన, ఉన్నా తమ మనసుల మధ్య తామరతూడు దూరేంత స్థలం కూడా ఉండదు.

ఈ గుండెలపై ఆడించి ఆ గుండెల్లోనే గుడికట్టి ప్రతిష్ఠించుకుని నిత్యారాధనతో వలచి కొలుచుకునే తనకీ అతనికీ తన అంతరంగ నివాసమే అంతఃపురం రాధ ఆరాధన ఆ రాధామనోహరుడికే తెలుసుః తనకు తెలుసు. అది తెలియని వెర్రిలోకం..కృష్ణుడు రాధను మరిచి విడిచి వెళ్లాడనుకుంటుంది. అనుకోనీ! తనకేం'

అమ్మమ్మా!'

గడపలో నుంచుని ద్వారబంధానికి చేరగిలబడి గదిలోని అలంకరణ చూస్తూ అతని ఆలోచనల్లో మునిగిన రాధ ఉలిక్కిపడింది.

'ఏమిటి అమ్మమ్మా! అంతలేసి ఆలోచనలు?'

అంది రాధిక

రాధిక..........

రాధకీ పరసకీ కూతురు కూతురు.......

దీపావళికి విచ్చేసింది అమ్మమ్మగారి పల్లెకు. దీపావళి పండుగ దేశరాజధానిలో కంటే దేశ నగరాల్లోకంటే అత్యంత వైభవంగా జరుపుకుంటారు ప్రేపల్లెలో! ప్రాగ్జ్యోతిషంలోకంటే మిన్నగా అక్కడి అన్నుల మిన్నల కన్నుల వెన్నెలలో నింపుకుని దీపావళీ జ్యోతిరుత్సవాన్ని నిర్వహిస్తారు.

"ఆ పడమటింటి అలంకరణ యింకా మిగిలే వుందా?"

'పెళ్లి కాని పిల్లవు, పడమటింటి ముద్దూ ముచ్చటలు నీకేం తెలుస్తాయ్! ఇలారా! ఇలా నా భుజం మీద నుంచి తొంగిచూడూ! నా చూపుల మార్గంలోనే నీ చూపూ ప్రవహిస్తే నీలాల మబ్బుతునక నిలపడానికి నే చేసిన సింగారం తెలుస్తుంది!' అంది రాధ

అలాగే చూసింది.

రాధ కంటే రాధిక జానెడెత్తు అధికం....'అలాగే జాణతనం' కూడా అంటుంది. రాధ..అనూరాధ నక్షత్రంలో అమ్మమ్మ పోలికలు పుణికి పుచ్చుకున్న ఆ పిల్లకి రాధిక పేరు సూచించింది రాధే!

'అమ్మో! అంది రాధిక

'అమ్మమ్మ ఆలనలో ఉంటూ అమ్మో అంటావేమిటి?

'అమ్మమ్మో!' అంది చిలిపిగా రాధిక

'ఏమ్మా?'

'నేను నీ కమ్మనా?'

'అవును! నీవు నాకమ్మవే (నాకు అమ్మవే) నా కమ్మవే! (స్వర్గానివే) నా కమ్మవే! (నా చెవి ఆభరణానివే!) నా కమ్మవే (నా మనసులోని కమ్మదనానివే)' అంది రాధ. రాధిక చెక్కిలిని తన బుగ్గకి హత్తుకుంటూ

'ఈ మందిరం ఎలా ఉందో చెప్పనా?

'మందిరమంటే ఇది!'

కాదులే! కాదులే! మనోమందిరం

'చెప్పు చూద్దాం'

చూద్దాం కాదు. వింటా అను అమ్మమ్మా. నీ నీలాల మబ్బు తునకనింగిని విడిచి విడిది చేసినట్టు, నీ కాళిందీ ప్రభువు కాళిందీజలాలు కజ్జలజలం చేసినట్టు, నీలిసంద్ర నివాసి తన నివాసం మార్చేసినట్టు నీలినీలి గోరింటలు నీలి నీలి నీలాంబరాలు కుప్పలు తెప్పలుగా కూర్చినట్టు, ఎటుచూసినా నీల వర్ణుడు రంగు తెలీకుండా కలిసి పోయేటట్టు ఈ పడమటిల్లంతా నీలవర్ణం చేసేశావు. గోడల రంగు, మంచం రంగు, పరుపు రంగు, దాని మీద పరచిన వస్త్ర వర్ణం, అలంకృత సామాగ్రి, వెలిగించబోయే కాచదీపవర్ణం అంతా నీ నీలమోహనుడి మోహన రూపమే"!

చప్పున ముద్దాడింది రాధ

"ముద్దులన్నీ వ్యర్థం చేస్తున్నావ్ అమ్మమ్మా! తాతయ్య కోసం ముద్దచేసి పెట్టానన్నావ్?' గారాబంగా అంది రాధిక

'తాతయ్య ఎవరు?'

'ఈ గోపయ్య కాదులే! అష్టమహిషీ వల్లభుడు, పదారువేల గోపికా మనోహరుడు, గీతా ప్రవచనకారుడు, రాజకీయ వేత్త ఘటనాఘటన సమర్థుడూ..అన్నిటికి మించి అర్జునుడి అనుంగు చెలికాడు అంతకు మించి నీ అంతరంగాన్ని అనుక్షణం ఏలుకునే ముగ్ధమోహన రూపుడు ఆ నల్లనయ్యేలే....."'

నవ్వింది రాధ.....

అంతలోనే కోపం వచ్చింది ఆమెకి 'నా స్వామిని తాతయ్య అంటావేం.'

'మరెలా పిలవాలి?'

'కృష్ణా! గోపికా వల్లభా! గోపీ జన మానస నివాసా!

'నేను కృష్ణసహస్రనామాలు, కృష్ణ అష్టోత్తరాలూ నేర్చుకోలేదు...పూజించడానికీ, ఆరాధించడానికీ.....'

'ఈ రాధ చెంతకు వస్తే చాలు ఆరాధన దానంతట అదే పుట్టుకొస్తుంది! ఈ తన్మయం ఈ నిరీక్షణ ఈ తహతహ ఈ తొందరపాటు ఏం చెబుతాయో నాకు తెలీదా?'

'నాకు ఈ రాధ ప్రేమచాలు!

'నా' ప్రేమ అంటేనే నా స్వామి ప్రేమ కలిసి వచ్చినట్టు'

'స్వామి! స్వామి! ఏం గొప్ప ఆయనది! అంతా అలా వెర్రి వాళ్లలా వెంట పడతారు? పిల్లన గ్రోవి ఊదూకుంటూ....ఇసుక తిన్నెల మీద యమునానదీ తీరతరుఛాయల విహరిస్తూ సోమరిలా బ్రతికిన అతన్ని మీరిలా ఎందుకారాధిస్తున్నారో నాకు అర్థం కావడంలేదు'

'అర్థం కాదు, అదంతే'

'ఎందుకేమిటి?'

'ఆ రూపు చూసి, ఆపాట విని, ఆ నాట్యంలో కలిసిపోతే ...కనీసం ఆ కన్నుల్లో కనులుంచి చూస్తే తెలుస్తుంది జన్మ తరిస్తుంది' అంది రాధ.

'నాకేం అక్కర్లేదు ఆతరింపు......ఆ ఆదరింపు....'

'అతని ఆదరణ అణుమాత్రం ప్రసరించినా నీవు యిలా ఎగిరెగిరి పడవు! అని ఆగి చూస్తావుగా! ఇప్పుడో..యీ క్షణమో అతనిక్కడి రాకపోడు...నిన్ను చూడక పోడు! నువ్వూ చూడక పోవు. నిన్ను చూసి కన్ను గీటితే, నీ మనోవీణ మీటినట్లై అతని గానానికి వర్తించకపోవు! అతడి వలపుకి కరిగి పోకపోవు......."

'మీ కదో పిత్తు! గమ్మత్తు! అతని పోకడలకు పోకముడి జారేలా, రైకముడి విడేలా లోబడి పోవడం మీకే చెల్లు....

రాధ ఏదో చెప్పబోయింది.

అంతలో వీధిలో కలకలం...క్రమంగా అది కోలాహలం.

జయజయధ్వానాలు మంగళతూర్యనాదాలు......

"మీరంతా యిక యిక్కడే ఆగండి! వెన్నెలని మరపించే కన్నెలను మురిపించే ఆ బాలగోపాలన్నీ అలరించే తన మనోహర వచనాలను విని అందరూ ఆగిపోయారు.

'రాధను చూసి, పలుకరించి, ఆమె విరహాన్ని మరిపించి, ఆమె ఆతిధ్యాన్ని స్వీకరించి మళ్ళీ మీ చెంతకు వస్తాను'

'రేయి తొలిజాము దాటితే యమున నీటికి వెన్నెల వెండిమలాం వేస్తుంది. గాలికి నెమ్మదితనం విచ్చేస్తుంది పరిమళ పరిష్వంగం జరిగిపోతుంది. ఆ వెన్నెల్లో ఆ తిన్నెల్లో నీ మురళీరవళిని మళ్లీ మళ్లీ విని, వినివిని తనివిని నింపుకుని ఈ బ్రతుకికి చాలు అనుకుంటాం' అన్నారు.

ఏకగ్రీవంగా వినిపించిన వేడికోలుకి నెమ్మదిగా తలూపి సమ్మతి తెలిపి..అటు తిరిగాడు కృష్ణుడు

అంతవరకూ వెన్నెల నిండినట్టుగా వున్న వాళ్లమోముల్లో అమాస చీకట్లు నిండుకున్నాయి....

'దీపావళిదాకా వేచిన మనస్సుదివ్వె వెలిగేదాకా నిలువలేదా! అనుకుని వెనుదిరిగారు

కృష్ణుడు మరో అడుగు ముందుకు వేశాడు.

'రాధా'!

ఆ పిలుపు వినగానే ఆమె అణువణువునా రాగలహరులు ప్రవహించాయ్...గుండెల్లో వేణువు మోగినట్లైంది

'క్రి.........ష్.........ణా............

అతన్ని సమీపించిన రాధను, అలాగే కౌగిలిలో చేర్చి హత్తుకున్నాడు అతను. అల్లుకు పోయింది రాధ

కరి మబ్బుని కమ్ముకున్న మెరుపు తీగెని చూసే అదృష్టం ఒక్క రాధికకి మాత్రమే దక్కింది!

చూసీ చూడక మునుపే కృష్ణుడు భువన మోహన రూపం రాధ మనస్సుని కమ్మేసింది.!

కృష్ణుడి కళ్లల్లో మెరిసే వింతకాంతి ఆమెను మైమరిపించింది...అప్రయత్నంగా ఆమె ముందుకు నడిచింది. కృష్ణుడి కౌగిలిలో సేదదీరింది రాధ

'రా .........ధా !

'ఎన్నేళ్ల కెన్నేళ్లకు?'

కృష్ణుడు చిరునవ్వే సమాధానం అన్నట్టు నవ్వాడు

కొన్ని క్షణాలు నిశ్శబ్దంలో కలిసిపోయాయి.

'కృష్ణా!'

'ఊ'

'అటు చూశావా?

'ఎటు?' నువ్వుంటే నిన్ను గాక వేరెవరినీ చూడను! నువ్వు గాక లోకంలో యింకెవరూ నాకు కనిపించరు! నీ పలుకు గాక వేరెవరి మాటా వినిపించదు!'

రాధ పరవశించి పోయింది.

'కృష్ణా ఆ చిన్నారిని చూడు!తమల పాకు తీగలా లేదూ! మెరుపు తీవలాలేదూ! జ్యోత్స్నాభి సారికలా వుంది కదూ! తన పేరు రాధిక! నిన్ను అది అనని, అనుకోని మాట లేదు! నువ్వట వృద్ధుడి వట! నిన్ను తలుచుకుంటూ వుంటే ఏమిటి అమ్మమ్మా! ఆ ముసలాయనలో ఏముంది? రంగా? కరిమబ్బు. రాగమా? పదారువేల పై చిలుకు! రాజకీయాలు, రణరంగాల్లో ఎత్తులు జిత్తులతో తన వాళ్లని మరచిన ఆ నాగరికుడు అనాగరీకుడు అంది కృష్ణా!'

కృష్ణుడు అన్నీ వింటూ చిరుదర హసంతో చూశాడు. రాధిక అతన్నే చూస్తోంది.

'అన్నీ నిజమే కదా రాధా? అయినా నా పరోక్షంగా అన్నేసి మాటలన్న అలికుల వేణి కిమ్మన్నాస్తి అన్నట్టు మౌనముద్రదాల్చిందేం?

'ఏమో కృష్ణా! జగన్నాటక సూత్రధారి వట కదా నువ్వు! నీకే తెలియాలి.! నీలో ఏముందని పదారువేల పడుచులు వెంటబడ్డారు అంది? ఎనిమిది మందిని పెళ్లాడావు కదా నీలో ఏం చూసి వలచారు 'అందయ్యా కృష్ణయ్యా ....? నన్నునన్నూ వదల్లేదు. రాసక్రీడలకు రాసనృత్యాలకు ఎలా అంగీకరించావని అడిగేసింది? జవాబు చెప్పటానికి సిగ్గేసిందయ్యా!'

రాధిక చిత్తరువులా నిలబడి పోయింది. రాధ ఆరోపణలకో కృష్ణుడి చిరునగవులకో అర్థం వెదుక్కుంటోంది.

కృష్ణుడు ఆమె దగ్గరికి నడిచి వస్తున్నాడు అతనామెను సమీపించే కొద్దీ రాధికలో జీవ చైతన్యం మొదలయింది. రతాంత సుఖ నిద్రుతి పొందిన నవోఢలా నిలబడి పోయింది. సూర్యకిరణాలు సోకీ సోకగానే పద్మినీ పుష్పభాను సహస్రకరాగ్రాలస్పర్శకు పులకించి పోయినట్లుగా వేవేల కిరణాలు తనని ముగ్ధం చేస్తున్న అనుభూతి.

ఆయన సమీపించాడు. నిస్తేజంగా నిలబడి ఉందా అన్నట్టున్న ఆ రసచైతన్యను సమీపించి గడ్డం పట్టి మోము పైకెత్తాడు

ఆ స్పర్శ ఆమెలో విద్యున్మాలికల మూల భూతాన్ని చైతన్యం చేసింది.

'రాధీ...రాధికా!"

వేయి వేణువులు ఒక్కసారి మోహనరాగాన్ని పలికించినట్లై పులకించి పోయిందామె. హిమగిరి శీతల వాయువులు సోకినట్టుగా సంచలించిపోయింది.

'రా..రాధీ...రాధికా! రాధికా! రాధీ ....రా!

ఒక్కసారిగా ఆ నల్లనయ్య ఎదుర్రొమ్ము మీద వాలి పోయిందామె. 'వెర్రిపిల్ల అనుకుని రాధ పడునుటింటి నుంచి వంటింట్లోకి వెళ్లిపోయింది.

కరి ఏనుగు లీలగా హేలగా తామరపూవుని అందుకున్నట్టు శ్రీ కృష్ణుడు ఆమెను తన చేతుల్లోకి తీసుకున్నాడు.

'కృష్ణా......కృష్ణా అంటోంది రాధిక అతని చేయి ఆమె వెన్నువెంట సవరింపుగా సాగింది.

స్మృతికి విస్మృతికీ మధ్య రాధిక కొన్ని క్షణాల అనంతరం మైమరిచిన రాధికని మంచం మీద పవళింప చేసి తన పై పంచె వీవనగా చేసి విసరసాగాడు. మంచు బిందువుల్లా నిలిచిన స్వేద బిందువులు ఆమె ముఖ కమలం మీద నుంచి మాయమైనాయి.

రాధిక కళ్లు తెరిచింది

'స్వామీ!' అంది ఆరాధనగా

'రాధీ...ధీరచిత్తవు కావే బేలా! ఏలా ఆ తొందర? ఏమి ఆ ఆరాటం.

'ప్రభూ! ప్రభూ!'

తీగలా చుట్టుకు పోయింది రాధిక' నన్నునీతో పాటే ద్వారకకు తీసుకుపో స్వామీ! నిను విడిచి నిముసమైనా వేగలేను, విరహాగ్నిలో నిలవలేను..."

'రాధీ!' సమాశ్వాసించాడు కృష్ణుడు ఆమె కనులు తుడిచాడు. శిరోజాలు సవరించాడు.

శిరస్సు నిమిరాడు మృదువుగా ఆమె మనస్సు తేట పడింది.

చేతులు జోడించింది "గోవర్ధన గిరి ధారీ! నన్ను ఉద్ధరించడం నీకు యింత సులువే?'

చిరునవ్వే ఆయన సమాధానమైంది

'నీ స్మరణ ఆజీవం వరంగా ప్రసాదించు ప్రభూ!'

కృష్ణుడు చిరుదరహాసంతో తథాస్తన్నాడు

'గో గోప గోపీజన వల్లభా! నన్నూ నీ దానిని చేసుకో!'

కృష్ణుడు ఆమె వామహస్తాన్ని అందుకున్నాడు

నిండు నూరేళ్లు భర్తతో సాంసారిక యజ్ఞం చేసి పుత్ర పౌత్ర సంపదతో వర్ధిల్లి ముత్తైదువుగా భర్తచేతుల్లో విశ్రాంతినందిన పరమ పతివ్రతా తిలకంలా అతని పాదాలు స్పృశించింది రాధిక

శ్రీకృష్ణుడు జగన్మోహనమైన దరహాసంతో ఆమెను కటాక్షించి అనుకున్నాడు

"పదహారువేల ఒకటి!"

● 17-8-90 హారిక వారపత్రిక ●